క్లుప్తంగా

ఆర్‌టీఐ సమన్వయ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులు

టెక్కలి: సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీని సోమవారం పట్టణంలో ఏర్పాటు చేశారు. జిల్లా ఇన్‌చార్జిగా, ఏపీ కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన ఎన్.అనిల్, జిల్లా కార్యదర్శిగా రాంబాబుతోపాటు మరి కొందరిని ఎన్నుకున్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు వెల్లడించారు.

రైతులకు అండగా నిలవాలి



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: కరువు ప్రాంతాల్లోని రైతులకు అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ ప్రతినిధి కప్ప గోపీనాథ్ కోరారు. ఈ మేరకు బూరగాం గ్రామ సచివాలయం వద్ద సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. కరువు సమస్యపై ఇప్పటి వరకు అధికార యంత్రాంగం స్పందించలేదన్నారు. విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని, రుణాలు మాఫీ చేయాలని, ఉపాధి పనులు ఎక్కువ రోజులు చేపట్టాలని కోరుతూ స్థానిక సచివాలయ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆబోతు ఢిల్లీరావు, మన్మథరావు, జోగయ్య, రామయ్య, దాసు ఉన్నారు.

సంతబొమ్మాళిలో కాఫీ విత్ క్లాప్‌మిత్ర



క్లాప్ మిత్రులను సన్మానిస్తున్న అధికారులు

సంతబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని సంతబొమ్మాళి గ్రామ పంచాయతీలోని సంపద సేకరణ కేంద్రం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అధ్యక్షతన స్థానిక సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సత్కరించారు. వారితో కలిసి కాఫీ తాగారు. ఎంపీడీవో ప్రేమలీల, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుకి ఘనంగా నివాళులు



బాలుకి నివాళులర్పిస్తున్న కళాకారులు

సోంపేట: గాయకుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమాన్ని సోంపేటలోని ఉన్నత పాఠశాలలో స్థానిక కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఎల్.కామేశ్వరరావు, కళాకారుడు హేమసుందర్, ఉపాధ్యాయులు జానకీరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

నూతన పింఛన్లు అందజేత

సోంపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువుతున్నాయని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నూతన పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్ పాల్గొన్నారు.

జగన్నాథుడికి తులసీదళాలతో పూజలు



పూజలందుకున్న స్వామివారు

ఇచ్ఛాపురం: పరివర్త ఏకాదశిని పురస్కరించుకుని ఇచ్ఛాపురం పట్టణంలోని జగన్నాథస్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం తులసీదళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామిని ప్రత్యేకంగా అలంకరించగా.. భక్తులు అధికంగా దర్శించుకున్నారు.

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



కాశీబుగ్గ: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



కోటబొమ్మాళి: చిన్నసాన గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సర్వేలో పాల్గొంటున్నారు. కోటబొమ్మాళి మండలంలోని చిన్న సాన, కురుడు, చీపుర్లపాడు సచివాలయాల పరిధిలో సోమవారం సర్వే చేపట్టారు. కొత్తపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వేతోపాటు వైద్య పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు అపర్ణ, స్వాతి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పోస్టర్ ఆవిష్కరణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సోమవారం జరిగింది. ఇందులో భాగంగా సూదికొండ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను 19, రెండు, 20వ వార్డు కౌన్సిలర్లు శిష్టు బృందావతి, బడగల సుజాత, అంబటి మాధురిలు పోస్టర్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బడగల బళ్లయ్యనాయుడు, పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి, 19 వార్డు పార్టీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, వార్డు అడ్మిన్ సెక్రెటరీ హెచ్.ధర్మారావు, ఏఎన్‌ఎం శ్రావణి, వార్డు వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరుగుపోటీలో పలాస విద్యార్థిని ప్రతిభ



విజయను సత్కరిస్తున్న అధ్యాపకులు



స్కేటింగ్‌లో రాణించిన చిన్నారులు

కాశీబుగ్గ: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన 36వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2023 క్రీడల్లో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన అడప విజయ పరుగుపందెంలో ప్రథమస్థానం సాధించింది. అండర్–23 విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో ప్రథమంగా నిలవగా.. 800 మీటర్ల అండర్–23 కేటగిరీలో ద్వితీయస్థానం, ఖేలో ఇండియా ఇన్ ఉమెన్స్ కేటగిరీ 1500 మీటర్లలో తృతీయస్థానాన్ని దక్కించుకుంది. స్థానిక విద్యావాహిణి డిగ్రీ కళాశాలలో చదువుతున్న విజయను ప్రిన్సిపాల్ అయిదం గిరిబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమలరావు, ఎన్ఎస్ఎస్ అధికారి పైల మన్మథరావు సోమవారం అభినందించారు.

స్కేటింగ్‌లో రాణించిన క్రీడాకారులు

కాశీబుగ్గ: గుంటూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పలాస క్రీడాకారులు రాణించారు. ఐదేళ్లలోపు బాలికల విభాగంలో జె.తోషినిరాయ్ 500 మీటర్ల రేస్‌లో ప్రథమంలో నిలవగా.. బాలుర విభాగంలో ఎ.అమాన్ తృతీయ స్థానం పొందారు. ఏడేళ్లలోపు బాలుర విభాగంలో బి.రుత్విక్ తృతీయ స్థానంలో నిలిచి జిల్లాకు పేరు తీసుకువచ్చారని శిక్షకుడు జె.గోపాల్‌క్రిష్ణ తెలిపారు.

పాఠశాలలో ‘నా దేశం–నామట్టి’



కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది



కవిటి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కంచిలి: బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‘నాదేశం–నామట్టి’ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సోమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు దేశభక్తిపై అవగాహన కల్పించారు. స్వాతంత్య్రం ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తన ఇంటి పరిధి నుంచి మట్టిని తీసుకొని వచ్చి పాఠశాల ఆవరణలో క్రాంతికార్ భగత్‌సింగ్ విగ్రహాన్ని నిర్మించటానికి నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారావు, శంకరరావు, నాగభూషణ్, కాంతారావు, రోజా, నిరంజన్ ఖడం పాల్గొన్నారు.

కవిటిలో ర్యాలీ..

దేశ స్వాతంత్య్ర సముపార్జనలో, దేశాభివృద్ధిలో విశేష సేవలందించిన జాతినేతల త్యాగాలు వెలకట్టలేనివని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నాదేశం–నామట్టి ప్రచారంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కవిటిలో దేశనాయకుల చిత్రపటాలు, ప్లకార్డులతో చైనత్యర్యాలీ నిర్వహించారు. దేశనేతలను స్మరిస్తూ నినాదాలు చేశారు.

బెంతొరియా విద్యార్థులకు న్యాయం చేయాలి

కంచిలి: బెంతొరియా విద్యార్థులకు న్యాయం చేయాలని అఖిలభారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా ప్రచారకమిటీ కన్వీనర్ డాక్టర్ సీపాన గుణవతి కోరారు. కంచిలి మండలంలోని బెంతొరియా కులస్తులు నివసించే గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక రెవెన్యూ అధికారులు బెంతొరియా సామాజిక వర్గం ప్రజలను ఎస్టీలుగా గుర్తిస్తూ ఉండేవారని, తర్వాత కాలంలో ఈ ప్రక్రియను నిలిపి వేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎస్టీలుగా రిజర్వేషన్లు కల్పిస్తుండగా.. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి, ఉపాధి కల్పనకు మాత్రం ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వారు నష్టపోతున్నారన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ



కాశీబుగ్గ: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కాశీబుగ్గ: కనీస వేతనాలు ఇవ్వాలని, పనిఒత్తిడి తగ్గించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ బస్టాండ్ నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం పీవో డి.శార్వాణికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎన్ గణపతి, యూనియన్ నాయకులు బి.సునీత, దమయంతి, చామంతి, తులసి, శైలజ, బేబీ, సుమతి, పద్మావతి, విజయ, అప్పలనరసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై చర్యలు తీసుకుంటాం

ఇచ్ఛాపురం రూరల్: నిరసనల పేరిట విధులకు డుమ్మ కొట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓ పి.నాగరాణి తెలిపారు. సోమవారం ఆమె పలు అంగన్‌వాడీలను సందర్శించగా ఆ సమయానికి అవి మూసిఉండటాన్ని గమనించారు.

రుణ సదుపాయంపై అవగాహన



చిన్నారావు యాదవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: గొర్రెలు, మేకల పెంపకదారులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలను, ఇతర సౌకర్యాలను పొందవచ్చునని జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షుడు రాపాక చిన్నారావుయాదవ్ అన్నారు. మాకన్నపల్లి పంచాయతీ పరిధిలోని గుడారమ్మ గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘం సభ్యులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి రుణాలు ఏవిధంగా పొందాలి, సంఘాలుగా ఏర్పాటుపై అవగాహన కల్పించారు. అనంతరం సంఘ అధ్యక్షుడుగా ఇటీవల నియామకమైన చిన్నారావు యాదవ్‌ను మాకన్నపల్లి పంచాయతీ సర్పంచ్ సైని దేశయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోరాడ ధనరాజు, ఉప సర్పంచ్ రాపాక పురుషోత్తం, సంఘం ఉపాధ్యక్షుడు దాసరి బారికయ్య, కార్యదర్శి కె.ఎల్.మూర్తి, మాజీ సర్పంచ్ గేదెల నీలకంఠం, గ్రామ పెద్దలు కుత్తుమ ధర్మారావు, దాసరి దానేష్, సాలిన కోదండరావు పాల్గొన్నారు.

నెరవేరుతున్న సొంతింటి కల



మాట్లాడుతున్న కడియాల ప్రకాష్

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సొంతంటి కల నెరవేరుతోందని కవిటి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. గృహనిర్మాణశాఖ అధికారులతో ఇళ్ల నిర్మాణంపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 15 లేఅవుట్లలో 50 మంది లబ్ధిదారులు ఇప్పటివరకు గృహ నిర్మాణాలను పూర్తి చేయగా.. మరో 426 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయన్నారు. సొంతస్థలాలు ఉన్నవారు కూడా చురుగ్గా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. తాజాగా జిల్లా ఉన్నతాధికారులు కొత్త డీపీఆర్ ప్రాప్తికి అర్హులు ఉంటే వారికి కూడా ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తుండడం ఆనందదాయకమన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ వై.నీలయ్య, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ ఎన్ని అశోక్, సర్పంచ్ దూగాన భద్రాచలం, ఎంపీటీసీ సభ్యులు చందాన పూర్ణచంద్రుడు, నర్తు అశోక్ పాల్గొన్నారు.

యువతకు వృత్తి విద్యలో శిక్షణ

ఇచ్ఛాపురం రూరల్: ఉన్నతి పేరుతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కూలీల కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుందని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు చెప్పారు. మండల మహిళా సమాఖ్య భవనంలో సీఎఫ్‌లతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ యువతకు 45 ఏళ్ల వయోపరిమితి, ఇతర సామాజిక వర్గానికి చెందిన యువతకు 35 ఏళ్లలోపు వయోపరిమితి ఉన్న వారు శిక్షణకు అర్హులన్నారు.

హాస్టల్ సీట్లు ఇవ్వడం లేదని ఫిర్యాదు



సబ్ కలెక్టర్ నూరుల్ కమార్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

టెక్కలి: టెక్కలిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో సీట్లు కోసం రోజుల తరబడి సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ కనీసం స్పందించడం లేదని నిరుద్యోగ పోరాట సమితి నాయకుడు టి.సూర్యం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన విభాగంలో ఫిర్యాదు చేసి తమ సమస్యను విన్నవించారు. దీంతో సబ్ కలెక్టర్ స్పందించి తక్షణమే బీసీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులను పిలిపించారు. ఫోన్‌లో జిల్లా అధికారులతో మాట్లాడి.. తక్షణమే విద్యార్థులకు హాస్టల్ సీట్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే టెక్కలి గ్రామ సచివాలయం–4, పెద్దసాన సచివాలయాల పరిధిలో కొంత మంది మహిళలు నిబంధనలకు విరుద్ధంగా ఒంటరి మహిళ పింఛన్లు అందుకుంటున్నారని ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ యు.విశ్వనాథం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందన విభాగానికి మొత్తం 15 వినతులు అందాయి.

గిరిజన భవనం పనులు ప్రారంభం



భవన నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

మందస: మందసలో గిరిజన సామాజిక భవన నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న గౌతు శ్యామసుందర శివాజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు జరగలేదు. ఈ పరిస్థితిలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మందసలో గిరిజన భవనం నిర్మిస్తామని మంత్రి సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. ఇటీవలే భవన నిర్మాణానికి భూమి పూజ జరుగగా.. సోమవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణానికి రూ.30 లక్షలు మంత్రి మంజూరు చేయించడంతో జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, సర్పంచ్‌లు సవర నవిత, రోజా, ఎంపీటీసీ సభ్యులు సవర ఢిల్లేశ్వరి, హరినారాయణ, గిరిజన నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.